ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★
జిల్లా వార్తలు
శుక్రవారం 6 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్

ప్రగతి ప్రాంగణాలకు రీ టెండర్ పూర్తి

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేసీఆర్ ప్రగతి ప్రాంగణాలకు రీ టెండర్ వేసినట్లు పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్ స్పందించారు. జిల్లాలో కేసీఆర్ ప్రగతి ప్రాంగణాల పేరిట నిర్మించిన భవనాల్లో కొన్ని అసంపూర్తిగా నిలిచి మరికొన్ని నిరుపయోగంగా మారాయి. దీనిపై ఈ నెల 4 'శిథిల ప్రాంగణాలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్ స్పందించారు. కేసీఆర్ ప్రగతి ప్రాంగణాల టెండర్‌ను నాలుగు సంవత్సరాల క్రితం వేశారని, వాటిని రద్దు చేశామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంగణాల నిర్మాణ టెండర్ జె.సంజీవ్‌కు కేటాయించినట్లు, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

పిల్లల చదువులపై దృష్టిసారించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తీర్ణత సాధిస్తారని ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్ కోరారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య బాలుర ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'పది' విద్యార్థులతోపాటు తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు.



సొంతింటిపై ఆశలు

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- యాప్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు తొలి ప్రాధాన్యం
- ప్రతీ మండల కేంద్రంలో మోడల్ హౌస్
- సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 7 వేల ఇళ్ల లక్ష్యం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పేదల సొంతింటి కల సాకారం కానుంది. ప్రభుత్వం ఆరుగ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించనుంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హుల ఎంపికకు అధికారులు సన్నద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సచివాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ అప్లికేషన్ యాప్‌ను ప్రారంభించారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హత ఉన్న పేద కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఇప్పటికే జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామ పంచాయతీల్లో 16 మంది సభ్యులతో ఇందిరమ్మ కమిటీలను నియమించారు. గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక చేపట్టనున్నారు. అర్హుల వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నారు.

నాలుగు విడతలుగా రూ.5 లక్షలు

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టనుంది. ఇందుకోసం మహిళల పేర్లతో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోనుంది. లబ్ధిదారుల ఎంపికలో దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు పది శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం జనరల్ కేటగిరీ కింద 15 శాతం చొప్పున ఇళ్లను కేటాయించనుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా నికి నాలుగు విడతలుగా రూ.5 లక్షలు విడుదల చేయనుంది. పునాది స్థాయిలో రూ.లక్ష, రెండో దశలో రూ.1.25 లక్షలు, మూడో దశలో స్లాబ్‌కు రూ. 1.75 లక్ష లు, ఫినిషింగ్, ఇతర దశలకు రూ.లక్ష చొప్పున అందజేయనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను కూడా యాప్ ద్వారా పొందుపర్చనుంది.



తొలి విడత వీరికి ప్రాధాన్యం

ఇందిరమ్మ కమిటీల ద్వారా తొలి విడతగా అత్యంత నిరుపేదలు, దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు,

మిగతా 6వ పేజీలో..

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్వీ గురుకులాల బాటలో నాయకులు

6



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ
- పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

6



ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

రైతుల అభివృద్ధికి కృషి

కోనరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. మండలంలోని సుద్దాలలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఎల్లయ్యను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మున్నూరు కాపు సంఘం నాయకులు కచ్చకాయల బాల్ రెడ్డి, సుంకరి పర్శరాములు, ఉప్పుల దేవయ్య, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెండింగ్ కేసులు పరిష్కారమయ్యే దిశగా కృషి చేయాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతీ సోమవారం సెస్ పరిధిలో ప్రజావాణి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సెస్ పరిధిలోని మండల సేవాసదన్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు సంస్థ ఎండీ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

10న విద్యుత్ సమస్య పరిష్కార వేదిక

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సెస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న వీర్నపల్లి రైతు వేదికలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక-2ను ఏర్పాటు చేయనున్నట్లు సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంకట్రావుపల్లెలో డీఎల్పీవో విచారణ

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లెలో డీఎల్పీవో నరేష్ గురువారం విచారణ చేపట్టారు. గ్రామసరిహద్దులు తమకు తెలియకుండా మార్చారని గ్రామస్థులు పంచాయితీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలో అభిప్రాయాలు సేకరించారు. గతంలో ఉన్న మాదిరిగానే గ్రామసరిహద్దులు ఉంచాలని సూచించారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎలా విభజిస్తారని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరిస్తేనే ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. ప్రజల అభిప్రాయాలను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎల్పీవో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ అనగోని మమతయాదగిరి పాల్గొన్నారు.

వేరుశనగలో కలుపుతీత పరికరం

- కూలీల భారం తగ్గించేందుకు రైతులకు ఉపయోగం



కలుపుతీస్తున్న రైతు లక్ష్మారెడ్డి

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ పనుల్లో కూలీల భారం తగ్గించడానికి ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన బోడ లక్ష్మారెడ్డి అనే రైతు కలుపుతీత పరికరం రూపొందించాడు. గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తున్నాడు. వేరుశనగ, మొక్కజొన్న చేలల్లో కలుపుతీయడానికి రైతులకు అధిక ఖర్చు అవుతుండడంతో తన ఆలోచనలకు పదును పెట్టాడు. ఫంక్షన్ హాల్స్‌లో ఉపయోగించే బుష్‌కటర్‌ను రూ.13 వేలకు కొనుగోలు చేశాడు. దీనికి మరో రూ.5 వేలతో ఇతర పరికరాలను కొనుగోలు చేసి కలుపుతీసే యంత్రాన్ని తయారు చేశాడు. పెట్రోలు సహాయంతో నడిచే కలుపు తీసే యంత్రం ద్వారా ప్రతీ రోజు నాలుగు ఎకరాల వరకు కలుపు తీయవచ్చు. కూలీల ద్వారా వేరుశనగలో నాలుగు ఎకరాలకు దాదాపు రూ.8 వేల వరకు ఖర్చు అవుతుండగా ఈయంత్రాన్ని వినియోగించడం ద్వారా కేవలం వెయ్యి రూపాయలతో పనిపూర్తవుతుంది.

ఖర్చులు తగ్గించాలని..

- బోడ లక్ష్మారెడ్డి, రైతు ముస్కానిపేట



రైతులకు కూలీల భారం అధికమవడం, సమయానికి కూలీలు లభించక కలుపు తీయడానికి పరికరం తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. బుష్‌కటర్‌ను కొనుగోలు చేసి దానికి సైకిల్ చక్రాలు, ఇతర పనిముట్లు ఉపయోగించి కలుపు తీస్తున్నాను. వేరుశనగ,మొక్కజొన్నతోపాటు డ్రమ్‌సీడర్ ద్వారా వేసిన వరిలోనూ కలుపుతీయవచ్చు. పెట్టుబడి భారం తగ్గుతుంది. లీటర్ పెట్రోలుతో 20 గుంటల భూమిలో కలుపుతీయవచ్చు. మిషన్ బాగా పనిచేస్తుంది.


మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళల రక్షణ విభాగంతో రూపొందించిన షీటీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌ల టీమ్‌ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైనపుడు షీటీమ్‌ను ఆశ్రయించాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలు, యువతులను వేధిస్తే కఠినచర్యలు తప్పవని అన్నారు. ఆకతాయిలపై నిరంతర నిఘా పెట్టామన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా షీటీమ్ సంప్రదించాని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న ఎంఈవో

చందుర్తి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చందుర్తి ఎంఈవో వినయ్‌కుమార్ అన్నారు. చందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, కృష్ణచైతన్య, సుస్మిత, ఉదయ్ భాస్కర్, కవిత ఉన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో నేల సారం పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మాధవి

సిరిసిల్ల రూరల్ /తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేల సారాన్ని పెంపొందించుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులు తప్పనిసరిగా వాడాలని అగ్రికల్చర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి సూచించారు. గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి రైతు వేదికలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోత పూర్తవగానే కొయ్యలను కాలువకుండా దున్నుకోవాలని సూచించారు. నేలల ఆరోగ్య పరిరక్షణలో మట్టి పరీక్ష ప్రాముఖ్యతను వివరించారు. వరి కొయ్యలను కాలిస్తే మట్టిలో ఉండే సూక్ష్మజీవులు నాశనమై భూమిలో సారం తగ్గిపోతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గౌతమి, వ్యవసాయ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదివే మట్టి పరీక్ష విభాగం విద్యార్థులు అభిరామ్, భరత్, సోనీ, సుస్మిత, ఉమ రైతులు తదితరులు పాల్గొన్నారు.

- భూసార పరీక్ష తప్పనిసరి

భూసార పరీక్షలను చేయించుకొని పంటలను సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి లతశ్రీ కోరారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో గురువారం పొలాల్లో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల అనంతరం పోషకాల మోతాదు ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. రైతుందరు తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలని సూచించారు. పంటల మార్పిడితో భూముల యొక్క ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చున్నారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి

చందుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడవులను, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు అన్నారు. చందుర్తి మండలం మల్యాల సెక్షన్ పరిధిలోని లింగంపేటలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ ఎండాకాలంలో అటవీ ప్రాంతంలోని పంట భూముల్లో నిప్పు పెట్టకూడదన్నారు. నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి అడవులు నష్టపోతామని, వన్యప్రాణులు మృత్యువాత పడుతాయని అన్నారు. సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీటీడీఏ అధికారులు రూపొందించిన బద్ది పోచమ్మ ఆలయ నమూన చిత్రం

బద్ది పోచమ్మ భక్తులకు తొలగనున్న కష్టాలు

- రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 32 గుంటల్లో నాలుగు గోపురాలతో నిర్మాణం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మ అమ్మవారి భక్తుల కష్టాలు తొలగనున్నాయి. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తారు. రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. నెత్తిన బోనంతో, సంకన పిల్లలతో భక్తులు సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం క్యూలో నిరీక్షిస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ప్రణాళికలు తయారు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో రూ.20 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వ హించారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల దృష్ట్యా కాంట్రాక్టర్ పనుల్లో జాప్యం చేశాడు. దీంతో వచ్చిన నిధులు తిరిగి వెనక్కి వెళ్లి పోవడంతో అభివృద్ధి పనులు మొదలు కాలేదు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ తిరిగి వెళ్లిన రూ.20 కోట్ల నిధులను తిరిగి తీసుకొచ్చా రు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యం లో పనులు వేగంగా జరుగుతున్నాయి.

32 గుంటల్లో ఆలయ విస్తరణ పనులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సమీపంలో గుంటన్నర స్థలంలో బద్ది పోచమ్మ ఆలయం ఉంది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆలయాన్ని విస్తరించి సదుపాయాలు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులు పలు ఊహా చిత్రాలతో ప్రణాళికలు సిద్ధం చేశారు. దానికి అనుగుణంగా ఆలయం చుట్టూరా ఉన్నటువంటి దుకాణదారులను, ఇళ్ల యజమానులను ఒప్పించి 40 గుంటల స్థలాన్ని సేకరించారు. ఎనిమిది గుంటల రోడ్డు విస్తరణ, సెట్‌బ్యాక్‌కు వెళ్లగా 32 గుంటల స్థలం ఆలయ అభివృద్ధికి అనుకూలంగా ఉంది. ఆలయ విస్తరణలో భాగంగా 40 మంది తమ ఇళ్లను కోల్పోతున్నారు. భూ నిర్వాసితులకు డబ్బులు చెల్లించేందుకు రూ.20 కోట్లను సాఫ్ట్ లోన్ ద్వారా రాజన్న ఆలయ నిధుల నుంచి తీసుకొని రూ.17.50 కోట్లు అందించారు. నిర్వాసితులకు డబ్బులు చెల్లించిన వెంటనే వ్యర్థాలను తొలగించారు. చదును చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. విస్తరణ పనులను 6 నెలల్లో కాంట్రాక్టర్ పూర్తి చేయాల్సి ఉంది.

వచ్చే డిసెంబరులోగా అందుబాటులోకి

- రఘునందన్, వేములవాడ రాజన్న ఆలయ డీఈ

బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం సేకరించాం. నిర్వాసితులకు డబ్బులు చెల్లించాం. ఎన్నికలతో అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటి వరకు రూ.2 కోట్ల పనులు జరగాల్సి ఉండగా రూ. 70 లక్షల వరకు పనులు పూ ర్తయ్యాయి. కాంట్రాక్టర్ 6 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. అనుకు న్న దాని కన్న ఎక్కువ సమయం పట్టడంతో మరో ఆరునెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. వచ్చే డిసెంబరు వరకు అందుబాటులోకి తెస్తాం.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాలు

నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న క్రమంలో బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు చేపట్టాలని వీటీడీఏ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించారు. అయితే 32 గుంటల్లో ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా ఆలయానికి ఉత్తరం, దక్షిణం, పడమర దిక్కుల్లో రోడ్లు ఉండడంతో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నారు. ఆలయానికి నాలుగు వైపుల నాలుగు గోపురాలు, బోనాల మండపం, పట్నాల మండపం, చుట్టూ ప్రాకారాలు, క్యూ కాంప్లెక్స్‌తోపాటుగా భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు, బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు.



ఆలయ విస్తరణ పనులు



సాగు చేస్తున్న నారంభట్ల భరద్వాజ్

సాఫ్ట్‌వేర్ వదిలి సేంద్రియ సాగువైపు..

- ఉద్యోగాలు వదిలి వ్యవసాయం
- సహజ పద్ధతిలో అధిక దిగుబడులు
- వరి, చెరుకు విత్తనోత్పత్తికి ప్రయత్నాలు
- రైతులకు అవగాహన

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్య అభ్యసించారు.. సాఫ్ట్‌వేర్ కొలువులో స్థిరపడ్డారు... అయినా వారికి వృత్తి పరంగా సంతృప్తి అనిపించలేదు. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై ఆసక్తి ఉండటంతో ఉద్యోగాలను వదిలి నూతన పద్ధతిలో సాగు చేయాలని ఇంటి బాట పట్టారు.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్, మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను వదిలి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చుట్టు పక్కల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ నుంచి సాగువైపు వచ్చిన రైతుల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

వరి, చెరుకు సాగు...

కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్ ముంబైలోని ఓ కార్పొరేట్ కంపెనీలో మంచి హోదాతో ఉద్యోగంలో చేరాడు. ఏడాదికి రూ. 6లక్షల ప్యాకేజీతో సుమారు రెండేళ్ల విధులు నిర్వహించాడు. వ్యవసాయంపై మక్కువతో వ్యవసాయం వైపు మళ్లాడు. ఊళ్లో తమకున్న 19ఎకరాల భూమిలో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వరి, చెరుకు సాగు చేస్తున్నాడు. విత్తనోత్పత్తి పంటలపై దృష్టి సారించాడు. చెరుకు, వరివిత్త నోత్పత్తిని చేస్తూ రైతులకు విక్రయిస్తున్నాడు. మెదక్, హన్మకొండ, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన వరి, చెరుకు విత్తనాలను భరద్వాజ్‌వద్ద నుంచి కొను గోలుచేసి తీసుకువెళ్తున్నారు. కొన్ని పశువులను పెంచుతూ స్వయంగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటూ విని యోగిస్తున్నాడు.

ఎరువుల దుకాణాల్లో లభించే వేస్ట్ డికంపోజర్ అను వంద లీటర్ల లిక్విడ్ బాటిల్‌ను తీసుకొని సుమారు పది కిలోల బెల్లం కలిపి మిశ్రమంగా తయారు చేస్తాడు. వరి, చెరుకు సాగుచేసే వ్యవసాయ క్షేత్రంలో సుమారు పక్షం రోజులు ముందుగా ఈ మిశ్రమాన్ని పిచికారి చేస్తా డు. మిశ్రమం నేలలో మురిగిన తరువాత సాగుకోసం దుక్కులు దున్నుతాడు. విత్త నాలు వేసి సేంద్రియ ఎరువులు విని యోగిస్తూ పంటలు సాగు చేస్తున్నాడు. దాదాపుగా మూడేళ్లుగా సాగు చేస్తున్న ఏ ఒక్క సందర్భంలోనూ భరద్వాజ్ వేసిన పంటకు ఎటువంటి తెగుళ్లు, దోమపోటు, రోగాలు రాకపోవడం విశేషం. సాధారణంగా ఎకరానికి సుమారు 30 నుంచి 34క్వింటాళ్ల వరకు వది దిగుబడి వస్తుండగా అదనంగా నాలుగు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగు బడి సాధిస్తున్నాడు. భరద్వాజ్ అనుసరిస్తున్న నూతన సాగు పద్ధతులు, కొత్త వంగడాల ఆవిష్కరణ వంటి అంశాలను గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఉత్తమ రైతుగా అవార్డును ప్రకటించింది. హైద్రాబాద్ లో మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.



ఆవులకు మేత వేస్తున్న భరద్వాజ్

సేంద్రియ వ్యవసాయంపై మక్కువతో...

మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఏడాదికి రూ. 16 లక్షల జీతం పొందేవాడు. కరోనా సమయంలో ఇంటికి చేరుకున్నాడు. ఉద్యోగం వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేందుకు నిశ్చయించుకున్నాడు. మొదట నాలుగు ఆవులు, పన్నెండు బర్రెలను కొనుగోలు చేశాడు. పంచగవ్య, జీవామృతం బ్రహ్మాస్త్రం వంటి ఆర్గానిక్ ఎరువులను తయారు చేసి పంటలపై పిచికారి చేశాడు. చీడపీడల నివారణకు వేప కషాయం పిచికారి చేశాడు. నలుగురు కూలీల సాయంతో ఆరు ఎకరాల్లో వరి, మిగితా భూమిలో మొక్కజొన్న, పసుపు, నువ్వ, వేరుశనగ, కూరగాయాలను పండిస్తున్నాడు.



చౌలమద్దిలో ఆర్గానిక్ ఎరువులతో సాగు చేసిన మొక్కజొన్నను చూపుతున్న మధుకుమార్



చౌలమద్దిలోని వ్యవసాయ క్షేత్రంలో పశువులకు ఆహారం అందిస్తున్న మధుకుమార్

సుభాష్ పాలేకర్ శిష్యరికంతో..

నారంభట్ల భరద్వాజ ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ అందిస్తున్న సుభాష్ పాలేకర్ వద్దకు వెళ్లి మెళుకువలను సాధించాడు. దీంతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ధ్యాన పండిత్ నెక్కోటి సుబ్బారావును ఆదర్శంగా తీసు కొని నూతన పద్ధతుల ద్వారా సాగు చేస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిపై తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ఉపయోగించి అధిక దిగుబడి సాధిస్తున్నాడు.

పంటలను నేరుగా మార్కెట్‌లోకి..

మధుకుమార్ తాను పండించిన పంటలను నేరుగా మార్కెట్‌కు తరలించి విక్రయించేవాడు. అనంతరం మెట్‌పల్లిలో ఒక షాప్ ఏర్పాటు చేసి వినియోగదారులకు సమాచారం అందించాడు. పంట ఉత్తత్తులు ఎప్పటకప్పుడు అమ్ముడు పోయాయి. ఆవు, బర్రె పాలు, పెరుగు, నెయ్యి, నెయ్యితో తయారు చేసిన తిను పదార్థాలతో పాటు పప్పు దినుసులు, పంటలు, తిను బండరాలు విక్రయించడం మొదలు పెట్టాడు. మార్కెట్‌లో మంచి స్పందన రావడంతో ఇతర రైతులు ఆర్గానిక్‌తో పండించిన పంట లను కూడా విక్రయిస్తున్నాడు.

వ్యవసాయమే పండుగలా మార్చాలని



పల్లెల్లో వ్యవసాయమే పండుగలా మార్చే ప్రయత్నంలో భాగంగానే సాగువైపు వచ్చాను. కుటుంబ సభ్యుల సహకారం సంపూర్ణంగా లభిస్తోంది. సాగులో సేంద్రియ విధానాలను వినియోగిస్తున్నాను. పలువురు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాను. దీనికితోడు విత్తనోత్పత్తి సైతం జరుపుతున్నాను.

-నారంభట్ల భరద్వాజ, రైతు, అయిలాపూర్

రైతుల్లో మార్పు కోసమే...



భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే రైతుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పంటలపై విపరీతంగా రసాయన ఎరువులు పిచికారీ చేయడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. రసాయనాలతో రైతులు అప్పుల పాలవుతున్నారు. దాన్ని చూసి కొంత మంది రైతులనైనా ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకరావాలని నిర్ణయించు కున్నాను. ఉద్యోగం వదిలి ఆర్గానిక్ వ్యవసాయం వైపుకు వచ్చాను.

- కుంట మధుకుమార్, చౌలమద్ది రైతు

రోడ్డు ప్రమాదంలో రైస్‌మిల్లు ఆపరేటర్ మృతి

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైస్‌మిల్లు ఆపరేటర్ మృతిచెందాడు. పెద్దపల్లికి చెందిన ప్రసాద్(35) అనే కార్మికుడు సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం మిల్లు వద్ద రాజీవ్ రహదారిని దాటుతుండగా సుల్తానాబద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు.

చిన్నారిపై వీధికుక్క దాడి

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రడం రియాన్ని (4) అనే చిన్నారిపై గురువారం వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. రియాన్షి ఇంటిముందు ఆడకుంటుండగా వీధికుక్క వచ్చి దాడి చేసింది. కుటుంబసభ్యులు ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాడంపల్లికి చెందిన ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొట్ల రాయమల్లు(64) భార్య వీరవ్వ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. భార్య ఆరోగ్యంపై బెంగపెట్టుకున్న రాయమల్లు తన భార్యకు ఏమైనా జరిగితే తాను ఒంటరి వాడిని అవుతాననే మనోవేదనకు గురయ్యాడు. తమ ఇంటి ముందు ఉండే మరో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న అధికారులు



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చందుర్తి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామ శివారులోని తిరుమల లోది ప్రాంతంలో అక్రమంగా మట్టితరలిస్తుండగా రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. తిరుమల లోది ప్రాంతంలోని సర్వే నంబరు 177లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా చదును చేస్తూ మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు రెవెనూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాదాపు మూడు ఎకరాల్లో భూమిని చదును చేశారని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు చదును చేసే పనులను నిలిపివేచారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ విచారణ అనంతరం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సుమన్ హత్య కేసు నిందితుల అరెస్ట్

- డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లిలో ఈ నెల 2న జరిగిన బొమ్మెల సుమన్ (34) హత్య కేసులో నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మెల సుమన్, బొమ్మల డిల్లేష్‌లు అన్నదమ్ములు. గతంలో బొమ్మల సుమన్ రోజూ మద్యం తాగి వచ్చి బొమ్మల డిల్లేష్‌ని అతని భార్యను, కుటుంబ సభ్యులను తిడుతూ, గొడవ చేస్తూ ఉండేవాడు. బొమ్మెల సుమన్ యొక్క తల్లికి ఆమె తండ్రి వారసత్వంగా వచ్చిన సుమారు 36 గుంటల భూమి కుమ్మరిపల్లి హాస్టల్ వద్ద ఉన్నది. అట్టి భూమిని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి సుమారు రూ.11 లక్షలకు అమ్మకానికి పెట్టగా అతడు బయానాగా రూ.2,60,000 అప్పజెప్పాడు. ఆ డబ్బులు మొత్తం డిల్లేష్ ఒక్కడే తనకు అప్పులు ఉన్నాయని చెప్పి తన సొంతానికి వాడుకున్నాడు. ఆ బయనా డబ్బులలో నాకు కూడా వాటా వస్తుందని సుమన్ పలుమార్లు డిల్లేష్ ని అడగగా ఈ విషయంలో వారి మధ్య గొడవలు జరిగాయి. దీనితో తన అన్నను చంపేస్తే ఆ భూమి డబ్బులు తనకే చెందుతాయని ఇక తన అన్నతో ఎలాంటి సమస్య ఉండదని భావించిన డిల్లేష్ తన అన్నను హత్య చేయాలని నిర్ణయించు కున్నాడు. కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు వంజరి సురేందర్ సహాయం కోరగా అతను కూడా హత్య చేయడానికి అంగీకరించాడు. దీనితో ఈ నెల 2న రాత్రి సుమన్‌ను బొమ్మెల డిల్లేశ్ అతని స్నేహితుడు పోతానక (వంజరి) సురేందర్ ఇద్దరు కలిసి కత్తితో పొడిచి హత్య చేసి పారిపోయారు. మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితులు ఇద్దరిని పోలీసులు గురువారం కుమ్మరిపల్లిలో అదుపులోకి తీసుకున్నా రు. నిందితుల నుంచి హత్యకి ఉపయోగించిన కత్తి, వారు పారిపోవడానికి ఉపయో గించిన బైక్, సెల్‌ఫోన్లు వారి బట్టలు స్వాధీనం చేసుకొని నిందితులని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహ రెడ్డి, వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్, బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పటిష్టమైన భద్రత కల్పించాలి

- ఎస్పీ అశోక్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

గొల్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను, భక్తుల క్యూలైన్‌లను, వాహనాల పార్కింగ్ స్థలాలను, రాకపోకలకు సంబంధించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్సై చిర్ర సతీష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.


ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తిరుకోవెల శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అటానమస్ హోదాలో పీజీ మొట్టమొదటి బ్యాచ్ ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ రెండవ సెమిస్టర్‌లో 254 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పీజీ నాలుగో సెమిస్టర్‌లో 247 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 214 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు టి కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రైల్వే సిబ్బంది

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేశాఖ గుర్తింపుసంఘం ఎన్నికలు గురువారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించారు. కరీంనగర్ నుంచి ఆర్మూర్ వరకు ఉన్న రైల్వేస్టేషన్ల పరిధిలోని అన్ని శాఖల్లో మొత్తం 308 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా శాఖలకు చెందిన రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 308 ఓట్లకు గాను 250 ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి యశ్‌పాల్‌సింగ్ తెలిపారు.

రేపు బీసీ కమిషన్ పర్యటన

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రానికి శనివారం ప్రత్యేక బీసీ కమిషన్ రానున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనకబాటుతనం, వాటి స్వభావం, ప్రభావం వంటివాటిపై అనుభవ పూర్వకమైన విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వాహించనున్నామని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వారు రాతపూర్వకంగా అభ్యర్థనలను ఇవ్వవచ్చని సూచించారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ జెండాను విడిచి పెట్టకుండా తన గెలుపు కోసం కష్టపడ్డారని ఆయన తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాస్ బహిరంగ సభలో పాల్గొనేందుకు తరలివచ్చిన ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి దేవాలయ అభివృద్ధి కోసం రూ 50 కోట్లు, మురికి నీరు గోదావరి నదిలో కలువకుండా డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ధర్మపురి పట్టణంలో నైట్ కాలేజీని పునఃప్రారంభం చేశామని, చెగ్యాం భూ నిర్వాసితులకు రూ.18 వేల కోట్లు పరిహారం అందించినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయించి, నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతకు ముందు ఇటీవల ప్రకటించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పాల గణేష్, రాందేని మొగిలి, మండల అధ్యక్షు లు అప్పం తిరుపతిని ప్రత్యేకంగా అభినందించారు. వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మారం మండలాల అధ్యక్షులుగా నియమితులైన రమేష్, అంజిత్, గౌతమ్, అనిల్, తిరుపతిలకు ఆయన పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సమావే శంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, మండల యు వజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు

- అసంపూర్తిగా బాలుర వసతి గృహం
- ఏళ్లుగా అద్దెగృహంలో హాస్టల్ నిర్వహణ
- అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు



అసంపూర్తిగా ఉన్న భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర వసతి గృహం

పెగడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహ నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. మండల వ్యవస్థ ఏర్పా టు నుంచి పెగడపల్లి మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలు అద్దె గృహాలలో నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణాల గూర్చి దశాబ్దాలుగా పట్టించుకోకపోగా గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ 2 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరు టెండరు ప్రక్రియ పూర్తి కాగా భవన నిర్మాణ పనులకు గత సంవత్సరమే అప్పుడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ శంకు స్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వరకు నిర్మించి అర్థాంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా అర్థాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు చేపట్టి అద్దె గృహాలలో అరకొర వసతుల నుంచి విముక్తులను చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి

బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. త్వరలోనే పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయిస్తాం. విద్యార్థులు అవస్థలు పడకుండా చర్యలు తీసుకుంటాం

- ధనుంజయ్, ఏఈ

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గంగాధర కేజీబీవీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో పూర్ణిమ గౌతమి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నర్సింగ్, సివిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన వారు రెండు రోజుల్లో పాఠశాల పనిదినాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ పోస్టుకు ఎమ్మెస్సీ లేదా బీఎస్సీ నర్సింగ్ ఉండాలని, సివిక్స్‌కు ఎంఏ(పొలిటికల్ సైన్స్)తో బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.

రామడుగు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనేరావుపేట కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టును తాత్కలికంగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో జరిగిన బీఎస్సీ ఆనర్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ యు శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం సచివాలయంలో ఎస్‌యూ వీసీ ఉమేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని వీసీ తెలిపారు.

గుర్తింపు దక్కేదెన్నడో..?

విధి నిర్వహణలో హోంగార్డులు పోలీసులకు ఏ మాత్రం తీసిపోరు. ఎండనకా, వాననకా రోడ్లపై పోలీసులతో సమానంగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. చాలీచాలని వేతనాలతో జీవితాలను వెల్లదీస్తున్నారు. ఏళ్ల తరబడి గుర్తింపునకు నోచుకోవడం లేదు. పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నా హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. **డిసెంబరు 6న హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..**





- పోలీసులతో సమానంగా విధులు
- అరకొర వేతనాలతో ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతో పాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో హోంగార్డులకు డ్రెస్, ఫుడ్, యూనిఫాం అలవెన్స్‌లు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. బెల్ట్, షూస్, సాక్స్, విజిల్‌కార్డు, క్యాప్‌లను 2015 నుంచి ఇవ్వడం లేదు. 2016 నుంచి కారుణ్య నియామకాలను నిలిపివేశారు. పోలీసులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నిటిని హోంగార్డులకు కల్పించాలని 2015లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చనిపోయిన హోంగార్డు కుటుంబానికి 10 లక్షలు నగదుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. పదవీ విరమణ పొందిన సమయంలో 5 లక్షలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని హోంగార్డులు ప్రభుత్వాన్ని, పోలీసుశాఖను కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 1,280 మంది హోంగార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,280మంది హోంగార్డులు ఉన్నారు. హోంగార్డులు పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నారు. కొంత మంది అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ, ఎఫ్‌సీఐ, ఎండోమెంట్, రైల్వే తదితర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలీసు ఠాణాలో 5నుంచి 10మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ పోషణకు ప్రస్తుత జీతం 27,640 రూపాయలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

● స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..

హోంగార్డు వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1946లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. ఈ విధంగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థను కాలక్రమేణా పోలీసుశాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1962-63లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. కానీ నేటి వరకు ఉద్యోగం శాశ్వతం కాకపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. కొంతమంది పోలీసు ఉన్నతాధికారులు తమ ఇళ్లలో హోంగార్డులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● పర్మినెంట్ చేయాలని డిమాండ్

హోంగార్డులను పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని వారు కోరుతున్నారు. పోలీసులకు చెల్లించే భత్యాలు వర్తింపజేయాలని, వారంలో ఒక సెలవు కల్పించాలని, బస్‌పాస్‌లు, ఆరోగ్య కార్డులను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలని కోరుతున్నారు. ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలని విన్నవించుకుంటున్నారు. కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతున్నారు.

పోలీస్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కల్పించాలి

- ఒక హోంగార్డు

హోంగార్డులకు కానిస్టేబుల్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కోటాను అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. పోలీసులకు కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు హోంగార్డులకు అమలు చేయాలి.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు గురువారం హాజరయ్యారు. కోరెం నుంచి నల్గొండ వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యారం గాన్ని నీరుగార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. చదువుతోపాటు, ప్రైవేటు స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ నియోజక వర్గంలో దశల వారీగా ట్రైనింగ్ సెంటర్ లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో చొప్ప దండి నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందన్నారు. బోయినపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ప్రస్తుతం ఉన్న పాఠశాల మొత్తం శిథిలావస్థకు చేరుతోందని, తన దృష్టికి రాగానే స్వయంగా సందర్శించి పాఠశాలను ఉన్న సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. కలెక్టర్‌కు సమస్యలు చెప్పగానే నిధులు మంజూరు చేశారన్నారు. పాఠశాల పూర్తిస్థాయిలో రూపు దిద్దుకుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డీఈవో జగన్‌మోహన్ రెడ్డి, సీఈవో వినోద్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మండల విద్యాధికారి శ్రావణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం పండితులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు గ్రామస్థులు, భక్తులు ఉత్సవ మూర్తులను గ్రామ చివర నుండి ఊరేగింపుగా యువతీ యువకులు నృత్యాలు చేస్తూ ఆలయానికి తీసుకవచ్చారు. గోవింద నామస్మరణతో అడుగుడుగునా భక్తి శ్రద్ధలతో మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రితో ఉపాధ్యాయ సంఘాల సమావేశం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు మేరుగు సతీష్ అధ్యక్షతన ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథిగా పర్వతరెడ్డి హాజరై మాట్లాడారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ఒకటవ తారీఖు వేతనం తిరిగి ప్రారంభం అవడం, బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడంతో మిగతా అన్ని సమస్యలు కూడా ఒక్కొక్కటి పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులు ఎంతో నమ్మకంతో ఇప్పటివరకు ఎదురుచూసారన్నారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉండి పరిష్కారానికి నోచుకోకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారన్నారు. ప్రధానంగా పెండింగ్ బిల్లులు మంజూరుకాక ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకొని పెట్టిన మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పిల్లల పెళ్లిళ్ల కోసం పెట్టిన జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు, డీఏ ఏరియర్స్ బిల్లులు ఏవీ కూడా సకాలంలో మంజూరుకావడం లేదన్నారు. పదేపదే బిల్లులు చేస్తూ సబ్మిట్ చేయడం సంవత్సరం దాటినా వాటికి మోక్షం కలగకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ అయిన వారికి రిటైర్మెంట్ తేదీ నాటికి అన్ని బిల్లులు చెల్లించాల్సి ఉండగా సంవత్సర కాలం గడిచినా ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. దీంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనలకు గురి అవుతూ విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకవెళ్తున్నా ఇంకా సమస్య అలాగే ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మందల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నడిపెల్లి సంతోష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి. మాధవాచారి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి తోట రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు, దాసరి శ్రీధర్, సీనియర్ నాయకులు ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఫయాజుద్దీన్, సుంకె నర్సింగమ్, మోతె సమ్మయ్య, గంధం రాజేందర్, కుసుమ దేవేందర్, గుండా మల్లిఖార్జున్, దాతు సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు

భగత్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పాటు, తెలంగాణలో కరీంనగర్ రీజియన్ ఎప్పుడూ ఉన్నత స్థానంలోనే నిలిచిందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమకాలు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్‌ట్రాఫిక్ మేనేజర్ సురేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆర్‌ఎంను కలిసిన డిపో మేనేజర్లు

రీజియన్ మేనేజర్ రాజును గురువారం డిపో మేనేజర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు నాగభూషణం, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, విజయమాధురి పాల్గొన్నారు.

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థి

- ఒడిశా గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది ఎలేటి నరేందర్‌రెడ్డి-వందనల కూతురు ఎలేటి వర్షారెడ్డి అగ్రికల్చర్ ఎమ్మెస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందకు రెండు బంగారు పతకాలు అందుకుంది. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉన్న వ్యవసాయ సాంకేతిక పరిశోధన సంస్థలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివిన వర్షారెడ్డి అత్యున్నత ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రఘువరన్‌దాసు, ఒడిశా ఉప ముఖ్యమంత్రి వర్ధన్ సింగ్, వైస్ ఛాన్సలర్ ప్రభాత్ కుమార్‌ల చేతుల మీదుగా వర్షారెడ్డి బంగారు పతకాలు అందుకుంది. వర్షారెడ్డిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెంచాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అధికారులకు వినతి

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో జమ్మికుంట రూట్‌లో బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో గురువారం వన్ డిపో ట్రాఫిక్ సీఐ హిమబిందుకు వినతిపత్రం అందించారు. వీణవంక, చల్లూరు, పచ్చునూరు గ్రామాల నుంచి నిరుద్యోగులు కరీంనగర్‌లోని ప్రైవేట్ షాపుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి 30నిమిషాలకు ఒక బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, వీణవంక మండల కేంద్రంలో ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షణ కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రచన, పరుశురాం, శ్రీకాంత్, సృజన్, సునీల్, తిరుమల, శంరమ్మ, అజయ్, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్తపై దాడి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలో సర్ది చెప్పెందుకు వెళ్లిన కార్పొరేటర్ భర్త కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డకు చెందిన అక్రం, ఆజాన్, అతిల్ ముగ్గురు సోదరులకు మధ్య గత కొంతకాలంగా కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 3న జరిగిన గొడవలో ఆజాం, అక్రం కలిసి అతిల్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త అయిన అతీనా అతిల్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. తన సోదరుడు అతీల్‌కు మద్దతు ఇస్తున్నాడని కార్పొరేటర్ భర్త అతీనాపై ఆజాం, అక్రం కక్ష పెంచుకున్నారు. ఈ నెల 4న రాత్రి ముగ్గురు సోదరుల మధ్య మరోసారి గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న అతీనా అక్కడకు చేరుకొని ఆజాం, అక్రంలకు సర్ది చెప్పేందుకు యత్నించాడు. దీంతో అతీనాపై కత్తితో దాడి చేశారు. గాయపడ్డ అతీనాను ఆసుపత్రికి తరలిచారు. అతీనా సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఆజాం, అక్రంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారవంతమైన నేలను అందించాలి

- తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం ప్రపంచ నేల దినోత్సవం, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, గ్రామ నవ నిర్మాణ సమితి స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని కాపాడుకోవాలని కోరారు. రైతు సంక్షేమ సంఘాలు ప్రకృతి వ్యవసాయంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దీనిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. మానవాళికి ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల ఒకటని చెప్పారు. నేల మనకు కన్నతల్లితో సమానమన్నారు. ప్రస్తుత వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని సూచించారు. ఆ దిశాగా వెళ్లాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. హైదరాబాద్ అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిచాలని కోరారు. ఐక్యరాజ్య సమితి సంస్థ ద్వారా యేటా డిసెంబరు 5వ తేదీన నిర్వహించే ప్రపంచ నేల దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది మట్టి గణాంకాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా 731కృషి విజ్ఞా కేంద్రాలు, 3వేల కృషి సఖిల (మహిళల) ద్వారా శిక్షణ ఇచ్చే విధంగా 10వేల జీవ వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టును తెలంగాణలో మొట్ట మొదటి సారిగా జమ్మికుంట కేవీకేలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమ సంఘం సభ్యులు భవానిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరుపున కూడా రైతు లకు సహాయం అందించాలని, ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కేవీకే ప్రధానకార్యదర్శి విజయ్ గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టును జమ్మికుంట, సైదాపూర్ మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో 6,340మంది రైతులతో 10వేల ఎకరాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి కుమారస్వామి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాలరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన వూటూరి దినేష్‌కుమార్(52) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దినేష్‌కుమార్ జగిత్యాల పట్టణంలో గత 20 సంవత్సరాలుగా లేడీస్‌ఎంపోరియం దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా దుకాణం సక్రమంగా నడవకపోవ డంతో దినేష్ కుమార్ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతూ మనోవే దనకు గురవుతున్నాడు. మంగళవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట శివారులో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. దినేష్‌కుమార్ కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

నవ వధువు ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన జక్కుల శ్రీలేఖ (23) అనే నవ వధువు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీలేఖకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జగద్గిరిగుట్టకు చెందిన పృథ్వీధర్‌రావుతో నవంబరు 7న వివాహం జరిగింది. నవంబరు 27న శ్రీలేఖ తండ్రికి అత్తింటివారు ఫోన్ చేసి జగద్గిరి గుట్టకు రావాలన్నారు. ఆయన అక్కడికి వెళ్లగా శ్రీలేఖను పుట్టింటికి తీసుకువెళ్ళమని చెప్పి పంపించారు. పెళ్లయిన 20 రోజులకే అత్తింటి వారు పుట్టింటికి పంపించి వేయడంతో మనస్థాపం చెందిన శ్రీలేఖ డిసెంబరు 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్రీలేఖ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వర్గీకరణ అమలుకు మాదిగల మహార్యాలీ



మల్లాపూర్‌లో ర్యాలీ చేపడుతున్న మాదిగ సంఘం సభ్యులు

మల్లాపూర్, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో గురువారం మల్లాపూర్‌లో వర్గీకరణ అమలు కోరుతూ మహార్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మాదిగ ఉపకులాల సభ్యులు స్థానిక వెంకటేశ్వరాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లినారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లు ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని కోరుతూ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రిజర్వేషన్ వర్గీకరణ ఒక్కటే మాదిగలకు న్యాయంను తహసీల్దార్ ద్వారా ప్రభుత్వంకు విన్నవిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏంఆర్‌ఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, ఆయా గ్రామాల మాదిగ కుల సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సర క్రితం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఆరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారన్నారు. గడిచిన ఏడాదిలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందు కెళ్తోందన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పినట్లు చెప్పారు. ఏటా లక్ష మంది యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దనుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకాకం రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన జరుగుతోందన్నారు. గల్ఫ్ బాధితులకు చేయూత కింద విదేశాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం కింద రూ. 5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి, మహిళా శక్తి భవనాలకు, మూసీనదికి పునరుజ్జీవనం, 200 విద్యుత్ సబ్ స్టేషన్‌లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, వేములవాడలో అన్నదానం కాంప్లెక్స్, ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా భూమి పూజలు చేసినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, శంకర్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, ననుగుల గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, పడాల శ్రీనివాస్, సూర యాదయ్య, స్వర్గం పరాంధామ్, పూదరి మహిపాల్, ఎర్రం ఆరవింద్, దయ్యాల శ్రీనివాస్, చెలుకల శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మహమ్మాయి దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహమ్మాయిదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ విగ్రహ..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధల నడుమ ఊరేగించారు. అంతకుముందు ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం పట్నం వేయడం, గావు పట్టడం, అన్నదానం వంటి కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించిన ఒగులాపూర్ యువకుడు

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన చింతలతానం రాజు రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల ప్రకటించిన గ్రూపు-4లో రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా ఎంపికయ్యాడు. గతంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా రాజును స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం

రుద్రంగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతిని మండల మేర సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పరిష్కరిస్తానన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు బాబాజీ కాలనీకి చెందిన మేకల రాజయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం కౌన్సిలర్లు చెన్నమనేని కీర్తి కమలాకర్‌రావు, భూక్య రెడ్డినాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్ అందజేశారు. ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రీ వేణుగోపాల్ యాదవ్, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో వైస్ ఛైర్మన్ బొందుగుల దేవిరెడ్డి, కనిమేని శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రదాన కార్యదర్శి వంగ మోహన్ రెడ్డి, తీనెటి రాంరెడ్డి, ఎక్కల్దేవి మహేష్, గంత సాయి కుమార్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం గోపలరావుపల్లెలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకుడు మీరాల శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. సీనియర్ నాయకులు కూతురి రాజు, లీజీప్ రెడ్డి, జంగం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



కేజీబీవీని సందర్శించిన బీఆర్ఎస్వీ నాయకులు

గంభీరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) గురుకులాల్లో నెలకొన్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యేదాక మా పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్వీ గురుకులాల బాట జిల్లా ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు. గంభీరావుపేట మండలంలో గురుకులాల బాటలో భాగంగా వసతి గృహాలు, పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వసతి గృహాలు సందర్శిస్తే ప్రభుత్వానికి భయమెందుకని, డీఈవో నుంచి అనుమతి పత్రాలు ఉంటేనే పరిశీలించాలా లేకుంటే సమస్యలు తెలుసుకోవద్దా అంటూ ప్రశ్నించారు. కొంత మంది విద్యార్థులకు దాదాపు 6 నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. పాఠశాల ఆవరణల్లో స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాలు లేవని, కోతుల బెడద కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. విద్యార్థులకు దుప్పట్లు, షూస్ లేవని, కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, ఆపరేటర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి చిట్టంపల్లి బిక్షపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జి దోసల శంకర్, బీఆర్ఎస్వీ నాయకులు ఉన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని వసతి గృహాల్లో విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను గురుకులాల బాటలో గురువారం పరిశీలించారు. విద్యార్థి విభాగం వీర్నపల్లి మండల ఇంచార్జ్ పొన్నం దేవరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం పరిశీలించారు. విద్యాలయంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, భోజనం అందించాలని సూచించారు. అనంతరం ప్రత్యేక అధికారి అజంతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ రేణుక, నాయకులు దేవరాజు, అనిల్, ప్రమోద్, తిరుపతినాయక్, బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

సొంతింటిపై ఆశలు

3వ పేజీ తరవాయి

ట్రాన్స్ జెండర్లకు వరుసక్రమంలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామసభలను నిర్వహించి ప్రజల సమక్షంలోనే అర్హుల వివరాలను తేల్చనున్నారు. పథకంలో భాగంగా ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మించనున్నారు.

జిల్లాలో 1.10 లక్షల దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు ఆహ్వానించగా వివిధ పథకాలకు 1,92,617 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇందిరమ్మ ఇళ్లకు 1,10,198 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇంటి స్థలాల కోసం 338 మంది అమరవీరుల కుటుంబాలు, ఇళ్ల కోసం 2130 మంది తెలంగాణ ఉద్యమకారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల విధి విధానాల షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి రూ.5 లక్షలు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. స్థలం లేనివారికి 75 గజాలు స్థలంతోపాటు నిర్మాణానికి సాయం చేయనున్నారు. ఈ క్రమంలో మొదటి విడతగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు 3500 ఇళ్ల చొప్పున 7 వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పకడ్బందీగా కేటాయిం చేందుకు జిల్లా అధికారులు దృష్టిసారించారు.

గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పిస్తాం

వీర్నపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రంథాలయాల పాత్ర విశిష్టమైందన్నారు. గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాములు నాయక్, వైస్ ఛైర్మన్ లెంకల లక్ష్మణ్, మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, వీర్నపల్లి మాజీ సర్పంచ్ పాటి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్నభోజన నిర్వాహకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలపరిషత్, తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమస్యలు తీరడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచడం లేదన్నారు. నిర్వాహకులు అప్పులు తీసుకొచ్చి వంటలు చేస్తున్నారని, సరైన సమయంలో బిల్లులు రావడం లేదని అన్నారు. ఈ నెల 10 నుంచి చేపట్టనున్న టోకెన్ సమ్మెలో భాగంగా విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయా కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు రాజవ్వ, జుబేదా, సంతోష, లత, వరలక్ష్మి, మంజుల, గిరిజ, రోజ, బాలమణి, సుగణ, లక్ష్మి, వసంత, వజ్రవ్వ, ముత్తవ్వ, పోచవ్వ, ఉన్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి) ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రుద్రంగి మండలం మానాల గ్రామంలో రైతులు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రెటరీ జక్కు వంశీ, జక్కు మోహన్, దీలీప్, రవీందర్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిటికెనకు యండమూరి అభినందనలు

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్ రాసిన స్క్రిప్ట్ 'ఓ తండ్రి తీర్పు' లఘుచిత్రం బాగుందని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అభినందనలు తెలిపారు. గురువారం రచయిత కిరణ్‌కు వాయిస్ మేసేజ్ పంపించారు. ఓ తండ్రి తీర్పు లఘుచిత్రానికి చక్కని కథను అందించారని పేర్కొన్నారు. ఈ చిత్రానికి అవార్డులు రావడం అభినందనీయమని తెలిపారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎర్రోజు సంతోష్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం సంతోష్‌కుమార్‌ను అభినందించారు. నూతన అధ్యక్షుడిని పలువురు యువకులు సన్మానించారు.

చందుర్తి : చందుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మర్రిగడ్డ గ్రామానికి చెందిన సంతపురి బాలకృష్ణ నియామకమయ్యారు. ఈ సందర్భంఆ బాలకృష్ణను కాంగ్రెస్ మండల నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

స్టాఫ్ నర్సులకు శిక్షణ తరగతులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు ఎన్‌సీడీ, ఆబాపై గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, దివ్యశ్రీ, సంపత్‌కుమార్, డీడీఎం కార్తీక్, హెచ్‌ఈ బాలయ్య ఆరోగ్యశాఖ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

బీర్‌పూర్,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి శిరుప నాగభూషణం తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ కస్తూర్బాలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అకౌంటెంట్ పోస్టు (1), ఏఎన్ఎం పోస్టు(1), అటెండర్ పోస్టు(1), డే వాచ్ ఉమెన్ పోస్టు(1), నైట్ వాచ్ ఉమెన్ పోస్టు(1), హెడ్ కుక్ పోస్టు(1), అసిస్టెంట్ కుక్ పోస్టు(1) 7వ, తరగతి, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు(1)కు విద్యార్హతలు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు ఆటోల బంద్



పోసర్ ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కోనరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఏడో తేదీన ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. కోనరావుపేట మండల కేంద్రంల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం ఆటో యూనియన్ నాయకులు ఆటోబంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. మండల అధ్యక్షుడు ఇమ్రాన్ పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగాన్ని తగ్గించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీఎస్ రావు అన్నారు. వేములవాడ మండల కేంద్రంలోని గ్రంథాలయానికి గురువారం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు విజ్ఞాన కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. యువత వేగంగా అభివృద్ధి చెందుతున్న హెల్త్ కేర్, జీవిత బీమా, ఎనర్జీ రంగం, ఐటీ, రియల్‌ఎస్టేట్‌పై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలోబార్ అసోసియేన్ అధ్యక్షుడు గుడిసే సదానందం లైబ్రేరియన్ అనిత, పాఠకులు శైలజ, స్రవంతి, సంధ్య తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తోందని, అక్రమంగా జైళ్లలో నిర్బంధిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో కలసి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన అరాచకాన్ని చాటుకుంటోందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండించారు. మాజీ మంత్రి హరీష్‌రావును అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించిన ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులపైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎందుకీ దౌర్జన్యం, దాషికం అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చింది కాబట్టి ప్రజలు ఎన్నుకుంటే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. తెలంగాణ ప్రజలు భవిష్యత్‌లో బొందపెట్టే సమయం వస్తుందన్నారు. అరెస్టులకు భయపడే వారు ఎవరూ లేరన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టామని, పచ్చని రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి చిచ్చుపెడుతున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

విజయోత్సవాలను చూసి ఓర్వలేక ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలు కోరుకొని బీఆర్ఎస్ నియంతృత్వ పాలనను అంతమొందించారని, గత డిసెంబరు 3న విలక్షణమైన తీర్పునిచ్చారని అన్నారు. హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. సంవత్సరకాలంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను చెప్పుకోవడం కోసమే విజయోత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబంలోని ఆ ఐదుగురికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 55,163 ఉద్యోగాలను ఇచ్చి నియామక పత్రాలను అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాదాపు 10వేల మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు. కాళేశ్వరం వద్ద భూ ప్రకంపనలు ఎలా వచ్చాయో అనేక మంది శాస్త్రవేత్తలు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురించిన 'ప్రాజెక్టుల వద్ద పనిచేయని భూప్రకంపనల సమాచార వ్యవస్థలు' వార్తను చూపించారు. కాళేశ్వరం పరివాహక ప్రాంతలో కొన్ని సంవత్సరాల క్రితం పెద్ద పెద్ద భవనాలు, డ్యాంలు కట్టవద్దని చెప్పినా రూ.లక్షా20వేల కోట్లు నీళ్లపాలు చేశారన్నారు. గత ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లులను ఎగనామం పెట్టిందన్నారు. గ్రంథాలయం జిల్లా ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి, విజయోత్సవాల నియోజకవర్గం కో ఆర్డినేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళ జిల్లా అధ్యక్షురాలు వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు మండలాలలో రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాలలో 16 రేషన్ డీలర్ స్థానాల కోసం ఈనెల 18లోగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు బాలమల్లేష్ సంస్మరణ సభ

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ సంస్మరణ సభను శనివారం సీపీఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల కార్మిక భవనంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. గురువారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శిగా బాలమల్లేష్ పదేళ్లు సేవలందించారని,ఈ నెల 1న గుండె పోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. నాయకులు పంతం రవి, సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.

పల్లిమక్తలో పశు వైద్య శిబిరం

కోనరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్తలో గురువారం కరీంనగర్ పశుగణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి అంజిరెడ్డి, వైద్యులు సాహితి, సూపర్‌వైజర్ రాములు, శ్రీకాంత్, అజయ్, రమేష్, దేవరాజు, చిద్రవేణి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ
- పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



సిరిసిల్లలో బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలను నిరసిస్తూ గురువారం వేములవాడలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది గడిచినా ఆరు గ్యారంటీలకు బదులుగా, ఆరు మోసాలు 66 అబద్ధాలు అన్నట్లుగా పాలన సాగుతోందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తెలంగాణలోనూ కర్ణాటక హిమాచల్ ప్రదేశ్ తరహాలో ప్రజల నుంచి దూరం కాక తప్పదన్నారు. మహిళలకు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రం మహేష్, బండ మల్లేశం, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లతో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాల గురించి ఫిర్యాదులు చేయండి అంటూ గురువారం సిరిసిల్ల పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుంచి బైక్ ర్యాలీని చేపట్టారు. ఈ బైక్‌ర్యాలీ పాతబస్టాండ్, పెద్దబజార్, వెంకటేశ్వర దేవస్థానం, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌరస్తా, గోపాల్‌నగర్ చౌరస్తాలమీదుగా బీవైనగర్‌లోని జెండా చౌరస్తావరకు సాగింది. అనంతరం బీవైనగర్‌లోని జెండా చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలను అభివృద్ధికి కృషి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ఇచ్చే హామీలకు మరోసారి మోస పోవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండే పార్టీని ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు గర్రిపెల్లి ప్రభాకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ మల్లారెడ్డి, నవీన్‌కుమార్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు అశోక్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.